

శబరిమలకు సైకిల్ యాత్ర
విశాఖ: ఆరిలోవ నుంచి నలుగురు అయ్యప్ప స్వాములు గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు.



ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు
-10లో

ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం 'వేవ్స్- 2024'కు సర్వం సిద్ధమైంది.



విశాఖ తీరంలో డాల్ఫిన్ కళేబరం
విశాఖ: రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్ వెనుక గల బీచ్‌కు శుక్రవారం సాయంత్రం డాల్ఫిన్ కళేబరం కొట్టుకుని వచ్చింది.

న్యూస్‌రీల్

ప్రత్యామ్నాయం వైపు గిరిజనులను మళ్లించాలి
- ఏవోబీలో గంజాయి సాగును పూర్తిగా ధ్వంసం చేయాలి
- డీజీపీ ద్వారకా తిరుమలరావు



డీఐజీ, ఎస్పీలతో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, విశాఖపట్నం: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి వ్యాపారస్తులు గిరిజనులను మభ్యపెట్టి వారిని ఉచ్చులోకి లాగుతున్నారని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయాన్ని డీజీపీ సందర్శించారు. ఆయనకు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రేంజ్ పరిధిలో ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. గంజాయి పంట వలన జరిగే నష్టాలను వివరించి, వాణిజ్య పంటలు వేసుకునేలా గిరిజనులు అవగాహన కల్పించాలన్నారు. ఏపీని గంజాయి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఏవోబీ ప్రాంతంలో గంజాయి సాగును పూర్తి స్థాయిలో ధ్వంసం చేయాలని ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఉన్న జిల్లాల అధికారులు ఒడిశా పోలీసులతో సమన్వయం చేసుకొని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను, డైనమిక్ చెక్‌పోస్టులను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.


హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి
- ఎస్పీ తుహిన్ సిన్హా
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



ప్రతిభ చూపిన హోంగార్డుకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పోలీస్ శాఖలో హోంగార్డు సేవలు క్రియాశీలకమైనవని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. శుక్రవారం హోంగార్డు వ్యవస్థ 62వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగమని, ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారని కితాబిచ్చారు. జిల్లాలో 678 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అంకిత భావంతో పనిచేసిన హోంగార్డులను ప్రశంసా పత్రాలతో ఆయన సత్కరించారు. జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, ఎ.ఆర్. డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు ఎల్.మన్మధరావు, సిహెచ్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమ ఉద్యోగి దుర్మరణం
- విధుల్లో ఉండగా ఫిట్స్ వచ్చి తలకు గాయం
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి



మృతి చెందిన నడిమింటి చైతన్య

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం ఎస్‌ఈజెడ్‌లోని ఎస్.వి. ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగి ఫిట్స్‌తో శుక్రవారం మృతి చెందినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్.నరసింగరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన నడిమింటి కృష్ణచైతన్య (35) రాంబిల్లి సెజ్‌లో గల ఎస్.వి.ఫార్మా పరిశ్రమలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో ఉండగా గత నెల 28న కృష్ణచైతన్యకు ఫిట్స్ వచ్చి పడిపోగా కంపెనీ యాజమాన్యం కుటుంబ సభ్యుల సహకారంతో విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది.

కృష్ణచైతన్య తలకు గాయమవడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 29వ తేదీన కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా 30న ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ కృష్ణచైతన్య ఈ నెల 5వ తేదీన మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, కంపెనీ ఏజీఎం ఎం.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు.

ప్రగతి వికాసం



న్యాయంపూడిలో రక్షిత మంచినీటి పథకం



తగరంపూడి గ్రామంలో చెత్త తొట్టి



కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికయిన న్యాయంపూడి గ్రామం

తగరంపూడి గ్రామం

కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ప్రతి ఏటా ఇచ్చే దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ శతత్ వికాస్ పురస్కారానికి జిల్లాలో రెండు పంచాయతీలు ఎంపికయ్యాయి. వీటిలో ఒకటి నక్కపల్లి మండలంలోని న్యాయంపూడి కాగా, మరొకటి అనకాపల్లి మండలం తగరంపూడి పంచాయతీ. 2024 సంవత్సరానికి గాను రాష్ట్రంలో ఈ అవార్డుకు నాలుగు పంచాయతీలు ఎంపిక కాగా అందులో రెండు అనకాపల్లి జిల్లా నుంచి ఉండడం విశేషం. వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌ల పాలనలో ఉన్న ఈ రెండు పంచాయతీల ప్రగతి ప్రస్థానంపై కథనాలు..

సుజలాం.. సుఫలాం..
- న్యాయంపూడిలో పుష్కలంగా నీటి సౌకర్యం
- జల సమృద్ధి కేటగిరీలో అవార్డు ప్రకటన

నక్కపల్లి: ఒకప్పుడు ఆ గ్రామంలో నీటికి కటకట.. ఇప్పుడు ప్రతి ఇంటా జల కళ. 'పానీ పట్టు' యుద్ధాలకు న్యాయంపూడి గ్రామం పెట్టింది పేరు. సుదూర ప్రాంతం నుంచి రక్షిత మంచినీరు వారానికో పది రోజులకో వచ్చేది. అందుకే ఈ గ్రామస్తులు బావులు, చేతి పంపులను ఆశ్రయించేవారు. నీటి కోసం ఘర్షణ పడేవారు. ఆ కష్టాలకు చెక్ చెబుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర భాగస్వామ్యంతో జలజీవన్‌మిషన్ పథకం కింద ఈ గ్రామానికి రూ.42 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో సర్పంచ్ వరహాలబాబు ఇంటింటికీ కుళాయి పథకాన్ని ఏర్పాటు చేశారు. వీధుల్లో, ప్రధాన కూడళ్లలో పబ్లిక్ కుళాయిలతోపాటు ప్రత్యేకంగా పైపులైన్లు వేసి ఇంటింటికీ కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరా కోసం ప్రత్యేకంగా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి బోరు ఏర్పాటు చేశారు. అలాగే ఎస్సీ కాలనీలో ప్రత్యేకంగా ఓవర్ హెడ్ ట్యాంకు కూడా నిర్మించారు. ఈ కాలనీ కోసం ప్రత్యేకంగా ప్రైవేటు బోరును కొనుగోలు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు.

రెండు నెలల క్రితం కేంద్ర బృందం పరిశీలన

అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోద్కర్‌లతో కూడిన అధికారుల బృందం కేంద్ర ప్రభుత్వ అవార్డుకు నామినేట్ అయిన డీఎల్ పురం, రమణయ్యపేట, న్యాయంపూడి గ్రామాల్లో రెండు నెలల క్రితం పర్యటించింది. నీటి సరఫరాలో న్యాయంపూడి గ్రామం అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ అవార్డుకు అవసరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటంతో జల సమృద్ధి కేటగిరీలో అవార్డుకు ఎంపిక చేసినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. పంచాయతీలో మొత్తం 1260 మంది జనాభా ఉన్నారు. 8 వార్డులున్నాయి. గ్రామంలో 350 కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశారు.



ఇంటి వద్దే కుళాయి నుంచి నీరు పట్టుకుంటున్న మహిళలు

11న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

ఈ నెల 11వ తేదీన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మెమెంటో, ప్రశంసాపత్రం, గ్రామాభివృద్ధి కోసం రూ. కోటి చెక్కును సర్పంచ్‌లకు అందజేస్తారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీపీవో, ఎంపీడీవో, సర్పంచ్‌లకు ఆహ్వానాలు అందాయి.

జగనన్న అడుగుజాడల్లో..



నా హయాంలో కేంద్ర ప్రభుత్వ అవార్డుకు న్యాయంపూడి పంచాయతీ ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి, ప్రతి కాలనీకి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నాను. తాగునీటి ఎద్దడి పూర్తిగా తొలగిపోయింది. పల్లెల ప్రగతికి ప్రాధాన్యమిచ్చే మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన స్ఫూర్తితోనే ఇది సాధ్యమయింది. ఈ అవార్డు ఇచ్చే ఉత్సాహంతో మరింత అభివృద్ధి చేస్తాను.

–రెడ్డి వరహాలబాబు, సర్పంచ్

కలెక్టర్ అభినందనలు

తుమ్మపాల: దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారాలు సాధించిన న్యాయంపూడి, తగరంపూడి పంచాయతీ యంత్రాంగాలకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి నక్కపల్లి మండలం దోనివాని లక్ష్మీపురం, న్యాయంపూడి గ్రామ పంచాయతీలు, అనకాపల్లి మండలం నుంచి తగరంపూడి, తుమ్మపాల గ్రామ పంచాయతీలు రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా, అందులో రెండు గ్రామ పంచాయతీలు జాతీయ పురస్కారానికి ఎంపికయినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిది అంశాలను ప్రామాణికంగా తీసుకుని అవార్డులు ప్రకటించగా న్యాయంపూడి గ్రామ పంచాయతీ నీటిసరఫరా విభాగంలోను, తగరంపూడి గ్రామ పంచాయతీ పచ్చదనం, పరిశుభ్రత విభాగంలోను అవార్డులు సాధించినట్లు ఆమె తెలిపారు. అవార్డు గెలుచుకున్న పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నగదు పురస్కారం అందిస్తుందని, ఆ నిధులతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి, అవార్డుల సాధనకు విశేషంగా కృషి చేసిన జిల్లా పంచాయతీ అధికారి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

పచ్చదనం.. పరిశుభ్రత
- ఉద్యానవనాలతో తగరంపూడి కళకళ
- క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో గుర్తింపు

అనకాపల్లి: పట్టణానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామమది. 2,300 మంది జనాభా. 80 శాతం మంది కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కానీ శుభ్రమైన రహదారులతో, పచ్చదనంతో కళకళలాడుతూ ఆ గ్రామం కేంద్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైంది. తగరంపూడి పంచాయతీ ఈ ఘనత సాధించింది. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, తడిపొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వాహణ, గ్రామంలో వీధులు, మురికి కాలువల నిర్వహణ ఇందుకు దోహదపడ్డాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, పాఠశాలల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతోపాటు, వాటిని అమలు చేసే విధానానికి సంతృప్తి చెందిన కేంద్ర బృందం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 11న జాతీయ స్థాయి అవార్డు అందుకునేందుకు గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.ఎన్.ఎస్.త్రినాథ్‌రావులు ఈనెల 10న ఢిల్లీ బయలుదేరనున్నారు.

పరిశుభ్రతను పాటిస్తున్నారిలా..

- రహదారులపై ఎక్కడా చెత్త చెదారం లేకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ప్రజలు చెత్తను రోడ్డుపై వేసేందుకు ఇష్టపడరు. రహదారిపై చెత్త కనిపిస్తే ఆగి దగ్గరలో ఉన్న చెత్తబుట్టలో వేసి వెళతారు.
- గ్రామంలో ఉన్న దుకాణాలు, టిఫిన్ షాప్‌లు, గృహాల వద్ద తడి, పొడి చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకుని పంచాయతీ పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు మాత్రమే చెత్తను అందజేస్తున్నారు.
- గ్రామ ప్రధాన ద్వారం వద్ద, మరో 10 ప్రదేశాల్లో చెత్తను వేసేందుకు చెత్త తొట్టెలను నిర్మించారు. చెత్త అక్కడే వేస్తారు.
- గ్రామంలో ప్రతి ఏడాది పది అమ్మవారి జాతరలు జరుగుతాయి. పండగ అయిన వెంటనే గ్రామ ప్రజలతోపాటు పారిశుధ్య కార్మికులు తక్షణమే చెత్త తొలగిస్తారు.



పచ్చని చెట్లు.. శుభ్రమైన రోడ్లతో తగరంపూడి గ్రామ రహదారి

- తగరంపూడి ప్రజలు పరిశుభ్రతకు ప్రాణం పెడతారని, గ్రామంలో ఏ షాప్‌కు వెళ్లినా చెత్తబుట్ట కనిపిస్తుందని పంచాయతీ కార్యదర్శి బి.ఎన్.ఎస్.త్రినాథ్‌రావు చెప్పారు.
- రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు వేశారు. పిచ్చిమొక్కలను తొలగించి ఆ ప్రదేశంలో కొబ్బరి మొక్కలు నాటి పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా ప్రజలు కృషి చేస్తున్నారు.

గ్రామ ప్రజల సహకారంతోనే..



కేంద్ర బృందం గత ఏడాది గ్రామంలో రెండుసార్లు పర్యటించింది. డ్రోన్ కెమెరాలతో ఫొటోలు తీసుకున్నారు. మా గ్రామ ప్రజలకు సొంత ఊరిని ఉన్నతంగా ఉంచుకోవాలన్న శ్రద్ధ ఎక్కువ. అపరిశుభ్రతకు తావు లేని విధంగా అందరూ మెలుగుతారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడం వారి ఆదర్శానికి తగిన గుర్తింపుగా భావిస్తున్నాను. ప్రజల సహకారంతోనే ఇదంతా సాధ్యమైంది. గ్రామాన్ని ఒక మోడల్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను.

–యాదగిరి అప్పారావు, గ్రామ సర్పంచ్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్
- మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. వేచలంలో శుక్రవారం జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యానికి అంబేడ్కర్ ప్రతీక అని, దళిత బహుజన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. రాజ్యాంగాన్ని రచించిన దార్శనికుడిగా, అంటరానితనం, వివక్షపై అలుపెరగని పోరాటం చేసి మార్గదర్శిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, కలిగొట్ల పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతు రాము, దళిత సంఘం నాయకురాలు మరియమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేచలపు గంగాధర్, వేచలం సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, బొబ్బిలి రాము, వేచలపు చిన్నంనాయుడు, వేచలపు సూరిబాబు, కర్రి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



వేచలంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

బలిఘట్టం ఆలయానికి మహర్దశ
- అన్నవరం దేవస్థానం దత్తత

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయ నిర్వహణ బాధ్యతలను అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం స్వీకరించింది. శుక్రవారం అన్నవరం దేవస్థానంలో శాస్త్రోక్తంగా దత్తత కార్యక్రమం జరిగింది. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, ఆలయ చైర్మన్ రోహిత్, ఈవో త్రినాథ్, బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయ ఈవో దివ్యతేజల సమక్షంలో దత్తత పత్రాలు సమర్పించుకున్నారు. ఆలయంలో అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేయడంతోపాటు నిర్వహణ బాధ్యతలన్నీ అన్నవరం దేవస్థానం పర్యవేక్షణలోనే కొనసాగుతాయన్నారు. స్వామివారి ఆలయానికి సమీపంలో కంచి పీఠం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు. తొలుత స్పీకర్ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల విజయ్, కౌన్సిలర్ సిహెచ్.రాజేష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో దత్తత పత్రాలను సమర్పించుకుంటున్న ఇరు ఆలయ అధికారులు

మొక్కుబడి సదస్సులు
- రెవెన్యూ సదస్సులకు కానరాని స్పందన
- తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 379 ఫిర్యాదులు
- 22 మండలాల్లో నిర్వహణ

తుమ్మపాల/సాక్షి నెట్‌వర్క్: రెవెన్యూ సదస్సులు మొదటి రోజు మొక్కుబడిగా ప్రారంభమయ్యాయి. సదస్సుకు వచ్చి తమ సమస్యలు విన్నవించుకోవాలని గురువారమే ఇంటింటికీ వెళ్లి కూటమి నేతలు బతిమలాడారు. అయినప్పటికీ ప్రజలను నుంచి స్పందన లేకపోవడం గమనార్హం. ఈ సదస్సులను విజయవంతం చేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి వారితో ఫిర్యాదు చేయించాలని జిల్లా ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు బాధ్యతలు అప్పగించారు. వారు గురువారం ఉదయం నుంచి వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి సదస్సుకు రావాలని, ఫిర్యాదులు ఏవైనా ఉంటే వినతిపత్రం అందజేయాలని కోరారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజలు ఈ సదస్సుకు హాజరుకాలేదు. మొదటి రోజు జిల్లాలో 22 మండలాల్లో 25 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. మొత్తం 379 అర్జీలు అందాయి.

స్పందన అంతంత మాత్రం

పాయకరావుపేట నియోజకవర్గంలో సదస్సులకు ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. నక్కపల్లి మండలం చినరామభద్రపురం, పాయకరావుపేట మండలం శ్రీరాంపురం, కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహించారు. వెబ్‌ల్యాండ్‌లో తమ భూమిని నమోదు చేయాలని, పాసుపుస్తకాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులు మినహా పెద్దగా సమస్యలు అధికారుల దృష్టికి రాలేదు. చినరామభద్రపురంలో రోడ్డు ఆక్రమణకు గురయిందని తొలగించి వెడల్పు చేయాలని గ్రామస్తులు కోరారు. నర్సీపట్నం నియోజకవర్గంలో భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వచ్చాయి. ఐదు గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 196 ఫిర్యాదులు అందాయి. వచ్చిన సమస్యలను అధికారులు అక్కడికక్కడే ఆన్‌లైన్ చేశారు. పాతమల్లంపేట, లచ్చన్నపాలెం రెవెన్యూ సదస్సులను ఆర్డీవో వి.వి.రమణ పర్యవేక్షించారు. చోడవరం నియోజకవర్గంలో 71 మంది రైతులు వివిధ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. సాగులో ఉన్నప్పటికీ పాసుపుస్తకాల్లో పూర్తిస్థాయిలో తమ భూమి వివరాలు నమోదు కాలేదని కొందరు, అనేక ఏళ్లుగా సాగులో ఉన్నా తమకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదని మరికొందరు వినతులు అందించారు. మాడుగుల నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామ సభలు సాదాసీదాగా ప్రారంభమయ్యాయి. మొత్తం 52 దరఖాస్తులు అందాయి.



అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో ఖాళీ కుర్చీల ముందు వేదికపై కూర్చున్న తహసీల్దార్ రవికుమార్

రెవెన్యూ సదస్సుల్లో తక్షణ పరిష్కారం: కలెక్టర్ విజయ కృష్ణన్

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను పరిశీలించి, వాటిలో కొన్నింటిని అధికారులు అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ నుంచి ఆమె మాట్లాడుతూ తొలి రోజు మొత్తం 379 అర్జీలు అందగా, వీటిలో 16 వినతులను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. మిగిలిన 363 అర్జీలను 43 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. మ్యుటేషన్ అర్జీలు 179, వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్లు 26, సంబంధం లేని అర్జీలు 154, 22ఏ డి నోటిఫికేషన్ 5, ల్యాండ్ గ్రాబింగ్ 6, ఎంక్రోచ్‌మెంట్స్ అర్జీలు 3, రీ సర్వే అర్జీలు 3, ఫారెస్ట్ ల్యాండ్ అర్జీలు 4, దేవదాయ శాఖ భూముల అర్జీలు 4 అందాయి.

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ

10లో

సాగరతీరంలో సునీత మధుర స్వర ప్రవాహం

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు యువత కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చిన్న వయసు నుంచి ఎంతో శ్రమించి, ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ అనేక డిగ్రీలు పూర్తి చేసిన అపరమేధవి అని చెప్పారు. అంటరానితనం నిర్మూలనకు, సమాజంలో ప్రజల మధ్య ఐక్యతకు అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కుల, మత, వర్ణ, వర్గ వివక్ష లేకుండా ప్రతి వ్యక్తికీ ఒకే విలువనిస్తూ విశాల భారతదేశాన్ని ఏకతాటిపై నిలిపే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించి మనకు అందించారని తెలిపారు. నేటి యువత అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, సీఐలు టి.లక్ష్మి, టి.కల్యాణి, ఎస్ఐలు బి.సురేష్ బాబు, డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం 'వేవ్స్- 2024'కు సర్వం సిద్ధమైంది. శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్,ఆర్థోపెడిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఎస్వీ ఆదినారాయణరావు ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. మంత్రి నారా లోకేష్, ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జి.ఎం.రావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ విద్యార్థుల అభిప్రాయాలు, పరిచయ కార్యక్రమాలు,ప్రసంగాలు జరుగుతాయి. ఏర్పాట్లను ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు శుక్రవారం తన చాంబర్‌ల వివిధ విభాగాధిపతులతో సమీక్షించారు.

ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



వరహాలరావు మృతదేహం

కోటవురట్ల: ఆటో ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన మేలాసు వరహాలరావు(55) శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం మండలంలోని బి.కె.పల్లి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా యండపల్లి శివారున ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో వరహాలరావు తలకు బలంగా దెబ్బ తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మన్యం ఆర్కిడ్లకు ఊపిరి

గిరిజన వృక్ష శాస్త్ర అధ్యాపకుడి స్ఫూర్తి



డెన్డ్రోలీరియం లాసియోపేటాలం కొత్త రకం ఆర్కిడ్

ప్రకృతి ప్రసాదించిన వృక్షజాతుల్లో కనువిందు చేసే ఆర్కిడ్స్‌కు పాడేరు డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి జానకిరావు జరిపిన పరిశోధనలు ఊపిరి పోస్తున్నాయి. అంతరించే స్థితిలో ఉన్న 90 శాతం రకాలను గుర్తించిన ఆయన.. అరుదైన ఏడు కొత్త రకాలను కనుగొన్నారు. అంతరించిపోయే దశలో ఉన్న వీటి పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను తన పరిశోధన నివేదికలో పేర్కొన్నారు. ఫలితంగా డాక్టరేట్ పొందారు.



ఏజెన్సీలో సేకరించిన మొక్కలను ఏయూలో పెంచుతున్న జానకిరావు



- పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి జానకిరావు విస్తృత పరిశోధనలు
- అంతరించే స్థితిలో 90 రకాలు గుర్తింపు
- వెలుగులోకి ఎనిమిది కొత్త రకాల ఆర్కిడ్లు
- ఏయూ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న జానకిరావు

పాడేరు: వృక్షజాతుల్లో ఆర్కిడ్లు అత్యంత అందమైన ప్రత్యేకమైన జాతి. దేశవ్యాప్తంగా 1,256 రకాలు ఉండగా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) నివేదిక ప్రకారం వీటిలో చాలా రకాలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. రాష్ట్రంలో 73 రకాల ఆర్కిడ్స్ ఉండగా వీటిలో అధికశాతం అల్లూరి జిల్లాలోనే ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ''స్టడీస్ ఆన్ ఆర్కిడ్ డైవర్సిటీ ఇన్ అల్లూరి సీతారామరాజు డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్ అండ్ ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ బయోలాజికల్ యాక్టివిటీ ఆఫ్ శ్రీ సెలెక్టెడ్ ఆర్కిడ్ స్పీసెస్'' అనే అంశంపై పాడేరు డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. జానకిరావు విస్తృత పరిశోధనలు చేశారు. దీనిలో భాగంగా సుమారు 60 రకాల ఆర్కిడ్ మొక్కలను సేకరించి పరిశోధనలు జరిపారు. ఇందులో అరుదైన ఎనిమిది కొత్త రకాలను గుర్తించారు. ఇవి విజ్ఞాన శాస్త్రానికి ఎంతో దోహదపడతాయని ఆయన చెబుతున్నారు. కొత్తగా కనుగొన్న వాటిలో పెలటాంతేరియా ఇన్సెక్టిఫెర, జ్యూక్లైన్ మొనేయి, డెండ్రోబియం బైకెమెరటం, డెండ్రోబియం క్రెపిడేటం, డెన్డ్రోలీరియం లాసియోపేటాలం, హబినేరియా లసినేట, పెరిస్టైలస్ కాంస్ట్రిక్టస్, ఏపీపోజియం రోసియమ్ అనే కొత్త రకాలు ఉన్నాయి.

ప్రత్యేకతలివీ..

ఆర్కిడ్ మొక్కలు అడవి ఆరోగ్య పరిస్థితికి సూచికలు. ఏమాత్రం కాలుష్యం ఉన్నా ఇవి చనిపోతాయి. పరిశోధనల్లో మూడు ఆర్కిడ్లు వండటిసెలేట, ఎరైడ్స్ ఓటోరేటా, సింబోడియం ఆలైపోలియం మొక్కలు ఔషధ గుణాలను కలిగి ఉన్నాయన్నారు. వీటి నుంచి సేకరించిన ఔషధాలతో సూడోమోనస్ ఫ్లోరిసెన్సు, స్ట్రెప్టో కోకస్ మ్యూటన్స్, బాసిల్లస్ సబ్టిలిస్, స్టెపాయిలోకోకస్ ఆరియస్ బాక్టీరియాలపై ప్రయోగాలు జరిపి ఆ బాక్టీరియా మీద బాగా పనిచేందన్నారు.

మన్యం అరుదైన జాతులకు నిలయం

ఆర్కిడ్స్ సంతతి అభివృద్ధికి జిల్లాలోని ఏజెన్సీ వాతావరణం అనుకూలంగా ఉందని ఆయన గుర్తించారు. ఇందుకు గాను ఆంధ్రా విశ్వవిద్యాలయం బోటనీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్ పొందారు. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ అల్లంగిపుట్టులో గిరిజన కుటుంబానికి చెందిన ఆయనకు చిన్నప్పటి నుంచి మొక్కలు, పుష్పాలు అంటే ఇష్టం. శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఏయూలో వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ ఎస్బీ పడాల్ వద్ద ఆర్కిడ్ మొక్కలపై విజయవంతంగా పరిశోధన పూర్తి చేశారు.



డెడ్రోబియం క్రెపిడేటం ఆర్కిడ్ కొత్త రకం

ప్రకృతి వనరుల పరిరక్షణకు కృషి

"స్థానిక ప్రకృతి వనరుల పరిరక్షణలో భాగంగా ఆర్కిడ్స్‌పై పరిశోధనలు చేశా. వీటిలో 90 శాతం మొక్కలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. అయితే జిల్లాలోని ఏజెన్సీ వాతావరణం, ఉత్తర తూర్పు రాష్ట్రాలతో పోలి ఉంది. ఇక్కడ ఆర్కిడ్ మొక్కల పెరుగుదలకు అనుకూలం. వీటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పరిశోధన నివేదికలో పేర్కొన్నా. ఆర్కిడ్ మొక్కలపై తాను చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది." - డాక్టర్ పి.జానకిరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రేబాక విద్యార్థులు

తుమ్మపాల: రీజినల్ 'పాలిటెక్నిక్ టెక్ ఫెస్ట్-2024'లో మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐ.వి.ఎ స్.ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన 124 ప్రాజెక్టులు ప్రదర్శించారన్నారు. తమ కళాశాల కంప్యూటర్ రెండో సంవత్సరం విద్యార్థులు థామస్, జాన్, శరవణభవ రూపొందించిన 10 టి, ఆగ్మెంటెడ్ రియాలిటీ ప్రాజెక్ట్ ఇన్ కంప్యూటర్స్ అనే ప్రాజెక్టు ప్రదర్శించారన్నారు. దీనికి 8వ బహుమతి పొందినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రెండో సంవత్సరం విద్యార్థులు జి.దివ్య, కె.శ్రీదేవి, పి.వసుధ, డి. భవ్యశ్రీ 'స్మార్ట్ ఫార్మింగ్' అనే ప్రాజెక్టు రూపొందించి 10వ బహుమతి సాధించారన్నారు. స్మార్ట్ ఫార్మింగ్ అనేది ఆర్డునో ఆధారిత ప్రాజెక్ట్, ఇందులో సెన్సార్లను ఉపయోగించి అధునాతన సాంకేతికత ద్వారా వ్యవసాయ కార్యకలాపాలను ప్రోత్సహించి, స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తిని సాధించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు కె. వెంకటేశ్వరరావు, తుమ్మిడి రాంకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు ప్రాజెక్టు గైడ్స్‌గా ఎలక్ట్రానిక్స్ అధ్యాపకురాలు బి.శ్రీకావ్య, కంప్యూటర్ విభాగం నుంచి గిరీష్‌రెడ్డి వ్యవహరించారు. ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డి.వి. రమణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన నిందితుడు గుమ్మడి సురేష్ అలియాస్ బండ సురేష్‌ను అదుపులోకి తీసుకుని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రాత్రి ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం సొంపురం గ్రామానికి చెందిన సురేష్‌పై అనకాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు, దేవరాపల్లి స్టేషన్‌లో ఒక కేసు, తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్, తెలంగాణా రాష్ట్రం నిజామాబాద్ జిల్లా బోధన్ పోలీస్ స్టేషన్ ఒక కేసు చొప్పున నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో తుమ్మపాల గ్రామం ఏలేరు కాలువ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సురేష్‌ను పట్టుకుని విచారించగా, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

సాగరతీరంలో సునీత మధుర స్వర ప్రవాహం



పాటలు పాడుతున్న గాయనీ సునీత, సంగీత విభావరికి హాజరైన జనం

ఏయూక్యాంపస్: సాగరతీరంలో సినీ గాయని సునీత ఉపద్రష్ట లైవ్ కాన్సర్ట్ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. సముద్ర కెరటాల హోరులో.. తన గాత్రంతో ఆమె ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అందంగా లేనా... అసలేం బాలేనా అంటూ...గోదావరి సినిమాలోని పాటతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. చిన్ని చిన్ని ఆశ.. ముద్దుముద్దు ఆశ ఆమె ఆలపిస్తుండగా.. యువత గొంతు కలిపారు. నా చెలి రోజావే.. నాతో ఉన్నావే అంటూ యువతలో జోష్ నింపారు. ప్రేక్షకులు తమకు ఇష్టమైన పాటలను అడిగి మరీ ఆమెతో పాడించుకున్నారు. మాఘమాసం ఎప్పుడొస్తుందో... పాటను పాడి అలరించారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌తో కలిసి సునీత పలు గీతాలను ఆలపించారు. ఆహ్లాదకర వాతావరణంలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి నగర ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం ఆస్వాదించారు.

90 మద్యం బాటిళ్ల స్వాధీనం



పట్టుకున్న మద్యం సీసాలు, నిందితుడితో పోలీసులు

బుచ్చియ్యపేట: మండల కేంద్రం బుచ్చియ్యపేట జంక్షన్‌లో శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో జరిపిన తనిఖీలో పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న మద్యంతో ఒకరు పట్టుబడ్డారు. బెల్ట్ షాపు నిర్వహణ నిమిత్తం అక్రమ అమ్మకాలు సాగించడానికి మద్యం తరలిస్తున్న సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా.. నిందితుడి వద్ద 90 మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

300 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పాయకరావుపేట: స్థానిక ధారకొండ వద్ద శుక్రవార నిర్వహించిన దాడుల్లో 300 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆయన వద్ద నుంచి 20 కేజీల నల్ల బెల్లం, 3 కేజీల అమ్మోనియా, 2 లీటర్లు నాటుసారా, ఒక ద్విచక్ర వాహనం కూడా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని యలమంచిలి సబ్ జైలుకు తరలించామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య



శివ అప్పల నాయుడు(ఫైల్)

నర్సీపట్నం: ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆర్మీ ఉద్యోగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాతవరం మండలం మర్రిపాలెంకు చెందిన బొచ్చా శివ అప్పలనాయుడు(30) జమ్ము కశ్మీర్‌లో ఆర్మీలో జవాన్‌గా పని చేస్తున్నాడు. జమ్ము కాశ్మీర్ నుంచి ఇటీవల హైదరాబాద్‌కు బదిలీ అయిన నేపథ్యంలో మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం సాయంత్రం నర్సీపట్నం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ లాడ్జీలో దిగాడు. రూమ్ తీసుకున్న సమయం ముగియడంతో లాడ్జీ సిబ్బంది వెళ్లి తలుపు కొట్టారు. తలుపు తెరుచుకోకపోవడంతో కన్నంలో నుంచి చూడగా అప్పలనాయుడు శ్లాబ్ కొక్కాంకు వేలాడుతూ కనిపించాడు. దీంతో లాడ్జీ సిబ్బంది పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గది తలుపు తెరిచి చూడగా అప్పలనాయుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ జి.గోవిందరావు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUS FOR SALE

■ Commercial New Building 30000 Sft @ Y-Junction, KUKATPALLY, Hyd, TG With MNC TENANT Rent 15 Lakhs Ph : 7675975236 [SCA24000763]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253940]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14790]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [HA-1388]

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ

తుమ్మపాల: రేషన్ డిపో డీలర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు డీఆర్వో సత్యనారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ పరిధిలోని ఏడు గ్రామాల్లో నూతన డిపోలు ఏర్పాటు చేస్తూ విడుదల చేసిన జీవో ప్రకారం ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13 లోగా అనకాపల్లిలో ఆర్డీవో కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 26న రాత పరీక్ష, 27న మౌఖిక ఇంటర్వ్యూ జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ పరిధిలో నివాసముండి, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు, డ్వాక్రా గ్రూపు సభ్యులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఖాళీల వివరాలు

మండలం	గ్రామం	రిజర్వేషన్
అనకాపల్లి	తుమ్మపాల-ఇందిరా నగర్	బీసీ-ఇ
అనకాపల్లి	కొత్తూరు 2	బీసీ-ఎ (మహిళ)
అనకాపల్లి	కొత్తూరు-రామాపురం	ఓసీ
అనకాపల్లి	సత్యనారాయణపురం-మూలపేట	ఎస్సీ(మహిళ)
అనకాపల్లి	అక్కిరెడ్డిపాలెం-టీఆర్ కాలనీ	ఓసీ (స్పోర్ట్స్ పర్సన్)
అచ్యుతాపురం	పెదపాడు	బీసీ-బి (మహిళ)
అచ్యుతాపురం	అందలాపల్లి	ఈడబ్ల్యూఎస్ (మహిళ)

పోలీసులపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై కేసు

మునగపాక: పోలీసు సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వెంకటాపురంలో గురువారం రాత్రి జరిగిన వివాహ కార్యక్రమంలో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయడాన్ని అడ్డుకున్న పోలీసులపై ముగ్గురు వ్యక్తులు తిరగబడి విధులకు ఆటంకం కలిగించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాత్రూమ్‌లో పడి పారిశుధ్య కార్మికురాలి మృతి

ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు ప్రాథమిక పాఠశాలలో బాత్రూమ్‌లో పడి పారిశుధ్య కార్మికురాలు దుర్మరణం పాలైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఏడిద కుమారి(40) పాఠశాలలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా మరుగుదొడ్లు శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయింది. తలకు బలమైన గాయం తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మరణించిందని ప్రధానోపాధ్యాయుడు జావేద్ ఉస్మాయిన్ తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ డీఈవోకు సమాచారం అందజేశారు.

భలే భలే ఏరో నీరో

గాల్లో నీరు పుడుతుందే.. తాగితే మస్తుగుంటుందే



గాలిలో తేమతో నీటిని అందించే వాటర్ ప్యూరిఫయర్

Something Special

సాక్షి, విశాఖపట్నం :

ఏంటీ మిషన్. వాటర్ ప్యూరిఫయరా..?

యస్.. ఇది స్వచ్ఛమైన నీటిని అందించే మిషన్..

అరె.. దీనిలో నీరు నింపేందుకు పైప్ కనెక్ట్ చెయ్యలేదెందుకు.?

అవన్నీ మీకెందుకు..? మీకు కావాల్సింది నీరే కదా..

అవును తాగాలని ఉంది. కానీ...!!!!

నీ సందేహంతో పాటు.. దాహం కూడా తీరుతుందిలే. ఆ గ్లాస్ పట్టుకొని.. ట్యాప్ కింద పెట్టి చూడు..

అరే.. నీరు వస్తుంది.. ఇదెలా సాధ్యం..?

అదే మ్యాజిక్కు... మాయా లేదు.. మంత్రం లేదు.. నీటిపైపూ లేదు.. శ్రమా లేదు.. నేను గానీ.. గ్లాస్ పట్టానంటే.. ఈ ప్యూరిఫైయర్ నుంచి నీరు రావాల్సిందే...

బాబూ... ఆ ట్రిక్ ఏంటో చెప్పు..!!!

చెప్తా.. ఈ ప్యూరిఫైయర్‌కు నీటి పైప్ అవసరం లేదు. కేవలం గాలిలో ఉన్న తేమని ఆక్సిజన్‌ని తీసుకొని.. నీటిగా మార్చేసుకుంటుంది. మనకు ఎంచక్కా అందించేస్తుంది.

అవునా.. నిజమా..!!

నిజం. ఇది కొత్త టెక్నాలజీ.. నీటి ఎద్దడి లేకుండా.. రాబోయే తరాలకు స్థిరమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యం అనే కాన్సెప్ట్‌తో అమెరికాలో స్థిరపడ్డ ఇండియన్ దుర్గాదాస్ ఆవిష్కరణ. ఈమె ఒకప్పటి భారత క్రికెట్ క్రీడాకారిణి కూడా. అమెరికా వెళ్లిపోయిన తర్వాత.. యూఎస్ మహిళా టీమ్‌కు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. ఆమె ఆలోచనల నుంచి పుట్టిందే ఏరో నీరో.

మరి.. గాల్లో ఎన్నో రకాల విషవాయువులు కూడా ఉంటాయి కదా.. మరి అందులోంచి తయారైన నీటిలో ఆ విషం ఉండదా.?

అదేం ఉండదు. ఇందులో నాలుగు అంచెల వ్యవస్థ ఏర్పాటు చేయడంతో గాలిలోని తేమను పోర్టబుల్ డ్రింకింగ్ వాటర్‌గా మారుస్తుంది. తొలుత ఎయిర్ ప్యూరిఫికేషన్ జరుగుతుంది. దీని ద్వారా గాల్లో మలినాలు తొలగిపోతాయి. అక్కడి నుంచి కార్బన్ ప్యూరిఫికేషన్ ద్వారా అసహ్యకరమైన రుచి, వాసన, రంగు తొలగిపోతాయి. అప్పుడు నీటిగా మారుతుంది. ఆ నీటిని యూవీ ప్యూరిఫికేషన్ చేసి బ్యాక్టీరియాని నాశనం చేస్తాయి. అప్పుడు మినరల్స్ మిళితమవుతాయి. దీని ద్వారా పీహెచ్ లెవల్స్ 7 నుంచి 8.5 పీహెచ్‌గా ఉంటాయి. అంటే.. పూర్తి ఆల్కలిన్ వాటర్‌గా గాలిలో తేమ మారి.. స్వచ్ఛమైన నీటిని అందిస్తుంది.



ప్యూరిఫయర్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు

భలేభలే.. మరి రోజుకు ఎన్ని లీటర్లు ఇస్తుందీ ఏరోనీరో..?

ఇందులో భిన్నమైన రకాలున్నాయంట. 10 నుంచి 25 లీటర్ల వరకూ ఇంట్లో వినియోగించే ప్యూరిఫైయర్లున్నాయి. ఇప్పటి వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాడుతున్నారు. ఈ ప్యూరిఫైయర్ల అమ్మకాల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ 1,71,50,920 లీటర్ల నీటిని తయారు చేశారంట. అంతేకాదు.. 6,86,03,680 లీటర్ల నీటిని ఆదా చేశారంట. సంస్థ వినూత్న ఆలోచన, నీటి ఆదా చేస్తున్న విధానాన్ని మెచ్చి.. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కూడా పొందారు.

అద్భుతం కదా.. మరి మీకెక్కడ తారసపడిందీ స్పెషల్ ప్యూరిఫయర్..?

ఓ.. అదా.. నగరంలో డీప్‌టెక్ కాంక్లేవ్ జరుగుతోంది కదా.. అక్కడ టెక్ ఎక్స్‌పోలో సంస్థ ప్రతినిధులు దీన్ని ప్రదర్శనకు ఉంచారు. చూస్తే.. అద్భుతమనిపించింది. మేం మాత్రమే తెలుసుకుంటే సరిపోదు కదా.. అందుకే.. మీలాంటి పాఠకులకీ అందిస్తున్నాం. ఇప్పుడు సరదాగా ఈ ప్యూరిఫయర్‌ను చూసి.. గాల్లో నీరు పుడుతుందే.. తాగితే మస్తుగుంటుందే.. అని పాడుకుందామా....!!

క్లుప్తంగా

14న దత్తాత్రేయ స్వామి జయంతి మహోత్సవం

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామంలో వెలసిన అనఘా సహిత దత్తాత్రేయ స్వామి జయంతి మహోత్సవాన్ని ఈ నెల 14న పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు దత్త పీఠం నిర్వాహకులు వేదుల బదరీ నారాయణమూర్తి, వేదుల శంకర భరద్వాజ్, ప్రధాన అర్చకుడు గుళ్లపల్లి శివకుమార్ తెలిపారు. ఆ రోజు వేకువజాము నుంచి విశేష పూజలు, ఉదయం 9 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం, మధ్యాహ్నం నారాయణసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతి

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన ఎరుకువానిపాలెంలో గాజువాకకు చెందిన మేడిశెట్టి రవికుమార్(48) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. సీఐ అశోక్‌కుమార్ వివరాలు మేరకు... రవికుమార్‌కు ఎరుకువానిపాలెంలో కొంత వరిపొలం ఉంది. అతడు తన తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి వచ్చాడు. ఇక్కడ బంధువుల ఇంట్లో తల్లిని ఉంచి, పొలం చూసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలం పక్కనే కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి మృతి చెందాడు. కొంత మంది రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

అప్పన్న అన్నదానానికి విరాళం



దాత లక్ష్మి బంధువులకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్న ప్రసాద పథకానికి శుక్రవారం సింహాచలంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతానికి చెందిన శీర లక్ష్మి రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని దాత కుటుంబీకులు డీడీ రూపంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు ఇచ్చారు. దేవస్థానం తరపున అన్నప్రసాద బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనాన్ని కల్పించి, ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు. అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 1,383 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,500
మొదటి రకం	3,500	4,390
రెండో రకం	3,090	3,800
మూడోరకం	2,970	3,080

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
పుష్ప-2	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 332 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

ఆగిన అభివృద్ధి



పిల్లర్లు వేసి తుప్పలతో దర్శనమిస్తున్న రైతు సేవా కేంద్రం



తుమ్మపాలలో శ్లాబ్ వరకే పరిమితమైన హెల్త్ క్లినిక్ భవనం

ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు చేరుస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేసింది. దాంతో సిబ్బందికి ఇరుకు గదుల్లో సేవలందించాల్సిన దుస్థితి నెలకొంది.

- గ్రామాల్లో అసంపూర్తిగా హెల్త్ క్లినిక్, సచివాలయ భవన నిర్మాణాలు
- నిధులు లేమితో ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

తుమ్మపాల: పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అన్న గాంధీజీ మాటలను నిజం చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రజలకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడం కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి రూ.లక్షల నిధులు కేటాయించారు. ఐదేళ్ల పాటు ప్రతి గ్రామంలో అనేక భవన నిర్మాణాలు పూర్తయి ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. అక్కడక్కడా నిలిచిపోయిన కొన్ని భవనాల పనులను కూటమి ప్రభుత్వం ఆపేసింది. ఎన్నికలకు ముందు అసంపూర్తిగా నిలిచిన పనులపై ఇంతవరకూ దృష్టి సారించడం లేదు.

ఇరుకు గదుల్లోనే సేవలు...

జిల్లా, మండల కేంద్రాల చుట్టూ తిరిగే పనిలేకుండా గత ప్రభుత్వం ప్రజల కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లతో పాలనను పల్లె ముంగిటకు చేర్చింది. వాటి కోసం భవనాల నిర్మాణం చేపట్టింది. ఈ వ్యవస్థలన్నీ నేడు ఆదరణ కోల్పోతున్నాయి. పరిపాలన, వైద్యం తదితరాలను ప్రజలకు చేరువ చేయాలని చేసిన సంకల్పం గాలిలో దీపంగా మారింది. వ్యవసాయపరంగా అన్ని రకాల సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతు సేవా కేంద్రాలుగా మారాయి. నూతన భవనాలు మంజూరు లేక ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్నాయి. వైద్యాన్ని పేదల ఇంటి ముంగిటకు చేర్చేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లను సైతం పంచాయతీ గదులు, అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు.

ప్రారంభం కాని పనులు...

మండలంలో 26 సచివాలయాలున్నాయి. గత ప్రభుత్వ పాలనలో మేజర్ పంచాయతీ తుమ్మపాలలో రూ.కోటి వ్యయం చేసి సచివాలయంతోపాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ఏర్పాటు చేశారు. ఇదేవిధంగా అన్ని గ్రామాల్లో ఆర్బీకేతో పాటు హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. ఎన్నికలకు ముందు వరకు జరిగిన పనులు ఆ తర్వాత నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనాల పనులు నేటికీ ప్రారంభం కాలేదు. మేజర్ పంచాయతీ తుమ్మపాలలోనే ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లు పిల్లర్లు, శ్లాబ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.



రంగుల కోసం ఎదురుచూస్తున్న సచివాలయ భవనం

సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయాలి



గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం బలోపేతం చేయాలి. ప్రజల కోసం ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌కు సొంత భవనాలు సమకూర్చాలి. తగిన సిబ్బందిని నియమించి సేవలు కొనసాగించాలి.

– పసుపులేటి లక్ష్మి, సర్పంచ్, శంకరం

నూతన భవనాలు మంజూరు చేయాలి

గత ప్రభుత్వం ప్రారంభించిన సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌కు అవసరమైన భవన వసతి లేదు. వీటిని ఇరుకు గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– తట్టా పెంటయ్యనాయుడు, సర్పంచ్, తుమ్మపాల

అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు ఘనత జగన్‌దే



రింగ్‌రోడ్డు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండపాటి జానకీ రామరాజు, మలసాల కుమార్‌రాజా

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం

అనకాపల్లి: గత వైఎస్సార్ సీపీ పాలనలో విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని పార్టీ పట్టణాధ్యక్షుడు మండపాటి జానకీరామరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డు వద్ద పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుని చిత్రపటానికి రాజా, జానకిరామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలసాల కిషోర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. జానకీరామరాజు మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ కన్న కలలు నిజం చేస్తూ గత వైఎస్సార్‌సీపీ పాలన సాగిందన్నారు. నేడు భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కూటమి పాలన సాగుతుందన్నారు. కక్షసాధింపులతో తమ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేస్తుందని ధ్వజమెత్తారు. 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు మాట్లాడుతూ దేశంలో అంటరానితనం రూపుమాపాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని భావించి ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చెప్పిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. దేశంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు భారత రాజ్యాంగాన్ని రాశారన్నారు. 83వ వార్డు ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి వివరించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అమెరికా నుంచి వీడియోకాల్ ద్వారా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశంలో జన్మించిన ప్రతి వ్యక్తి అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటున్నారన్నారు. ఇంత గొప్ప మహనీయుడు మన భారతీయుడు కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కశింకోట మండల ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, జోగా నాగేశ్వరరావు, పార్టీ కశింకోట అధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు ఉగ్గిన అప్పారావు, పీలా శ్యామ్, కె.ఎం.నాయుడు, కడిమిశెట్టి సతీష్, దండా జ్ఞానదీప్, దాడి నారాయణరావు, నడిశెట్టి మధు, పలకా సత్యనారాయణ, ఆర్టీసీ సత్యనారాయణ, గణేష్, గుండా రమేష్‌గుప్తా, పద్మ, పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ

అనకాపల్లి: పట్టణ, మండల జాతీయ రహదారిలో నేరాల నియంత్రణకు, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు డ్రోన్ కెమెరాల సహాయంతో శుక్రవారం నుంచి పర్యవేక్షించనున్నట్లు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాల మేరకు అత్యాధునిక పరికరాలను ఉపయోగించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా ట్రాఫిక్, చోరీలు, గొడవలు జరిగినట్లయితే డ్రోన్ కెమెరాలు ద్వారా నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నెహ్రూచౌక్‌లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ

పేరంట్స్ సమావేశాలకు సర్వం సిద్ధం

- వినూత్నంగా ఆహ్వాన పత్రికల తయారీ
- ముస్తాబైన పాఠశాలలు



కొత్తపల్లి హైస్కూలు విద్యార్థులు వినూత్నంగా తయారు చేసిన ఆహ్వాన పత్రికలు



కొత్తపల్లి హైస్కూలులో మామిడాకుల తోరణాలు కడుతున్న విద్యార్థులు



కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల రిహార్సల్

కశింకోట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరంట్స్ సమావేశాల కోసం విద్యార్థులు వినూత్నంగా ఆహ్వాన పత్రికలను తయారు చేశారు. ఇవి ఆహుతులను ఆకర్షిస్తున్నాయి. కాగితాలు, రంగు పెన్సిళ్లతో ఆహ్వాన పత్రిక తయారు చేసి వాటిని అందంగా వివిధ రంగుల పూలు, పక్షులు, వివిధ రకాల బొమ్మలు, స్కూలు యూనిఫాం రూపం వగైరాతో అద్ది అంటించిన కవర్లలో ఉంచి తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. కొత్తపల్లి హైస్కూలు విద్యార్థులు వీటిని ఆకర్షణీయంగా రూపొందించారు. స్కూలును, ప్రాంగణాన్ని శుభ్రపరచి అందంగా మామిడాకుల తోరణాలు కట్టి అలంకరించారు. తల్లిదండ్రులను సమావేశానికి ఆహ్వానిస్తూ బోర్డులు, చార్టులను ఏర్పాటు చేశారు. పేరెంట్ సమావేశాలు సందర్భంగా కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు డాన్స్‌లతో అలరించడానికి తర్ఫీదు పొందారు. కుర్చీలాట, ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు అందజేయడానికి బహుమతులను సిద్ధం చేశారు. ఇలాగే మిగిలిన పాఠశాలల్లోనూ మెగా పేరంట్స్ సమావేశాలు నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశామని, కశింకోట బాలికల, డీపీఎన్ జెడ్పీ హైస్కూళ్లలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అధికారులు హాజరు కానున్నారని ఎంఈవోలు జి. వెంకట సురేష్, ఎ.వి.ఎస్. మూర్తి తెలిపారు.

తుస్సుమన్న రెవెన్యూ సదస్సులు

- జనం లేక వెలవెల
- కూటమి నాయకులకే పరిమితమైన సదస్సు
- ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు సమాచారమే లేదు

తుమ్మపాల: ప్రజల సమస్యలు పరిష్కారంతోపాటు గత ప్రభుత్వంలో అవకతవకలు వెలికితీత అంటూ కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు జనం లేక వెలవెలబోయాయి. మండలంలో కోడూరు, రేబాక గ్రామాల్లో మొదటి రోజు చేపట్టిన రెవెన్యూ సదస్సులకు పట్టుమని పదిమంది కూడా జనం లేకపోవడంతో అధికారులు నివ్వెరపోయారు. ఖాళీ కుర్చీలతో మాట్లాడలేక ఇతర పనులంటూ కొంతమంది అధికారులు సదస్సుల మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో చేసేదేమిలేక సిబ్బంది కూడా తట్టాబుట్టా సర్దుకుని సమయానికి ముందే సదస్సులను ముగించేశారు.

రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలి: జేసీ

ప్రజలు తమ భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని జేసీ ఎం.జాహ్నవి తెలిపారు. శుక్రవారం ఉదయం కోడూరు రెవెన్యూ సదస్సులో ఆమెతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, ఆర్డీవో ఆయేషా, తహసీల్దార్ రవికుమార్ హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ వివిధ రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు తమ భూముల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 45 రోజుల గడువుతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి సమస్య పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శానాపతి లక్ష్మి, శ్రీనివాస్, మార్టూరు సన్యాసమ్మ, కూటమి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ట్రెజరీ అధికారి, ప్రత్యేక అధికారి సుభాషిణి

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన కరువైంది. కేవలం మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి. భూమి విస్తీర్ణం తక్కువగా ఉండటం, రీసర్వేలో సమస్యలు పరిష్కారం కావడంతో తక్కువ అర్జీలు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ప్రత్యేకాధికారి, జిల్లా ట్రెజరీ అధికారి సుభాషిణి హాజరై మాట్లాడారు. సదస్సుల్లో భూముల రీసర్వేతోపాటు ఇతర రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అసైన్డ్, చుక్కల భూములుగా పట్టా భూములు తప్పుగా నమోదై ఉంటే సదస్సుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. దీనివల్ల భవిష్యత్ అవసరాలకు భూములు ఉపయోగపడతాయని, లేదంటే అవి చుక్కలు, అసైన్డ్ భూములుగా మిగిలిపోయే అవకాశం ఉందన్నారు. షెడ్యూల్ ప్రకారం సదస్సు నిర్వహించే సమాచారాన్ని అందరికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అర్జీలను సకాలంలో పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తపల్లిలో గతంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 8 అర్జీలు రాగా, వాటిలో సగం పరిష్కరించామన్నారు. మిగిలినవి పరిష్కార దిశలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీల్లో తమ భూమిని అమ్ముకోవడానికి వీలుగా సబ్ డివిజన్ చేయాలని సుంకర రమణ, తన అన్న పేరున తప్పుగా నమోదు అయిన భూమిని తన పేరున మార్పు చేయాలని సుంకర చిన్నమ్మలు, అన్నదమ్ముల పంపకాల్లో నాలుగు సెంట్లు వచ్చిన భూమి రీ-సర్వేలో మూడు సెంట్లు వచ్చిందని, దాన్ని మళ్లీ సర్వే చేయాలని కల్లపల్లి కాసులమ్మ కోరుతూ అర్జీలు అందజేశారు. రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు, వీఆర్వో మీనాకుమారి, సర్వేయర్ రజిత, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి భారత పౌరుడిపై అంబేడ్కర్ ముద్ర



జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



తపాలాశాఖ కార్యాలయంలో



కశింకోట: అంబేడ్కర్ విగ్రహం ముందు నివాళులర్పిస్తున్న దళిత ప్రతినిధులు



సీఐటీయూ ఆధ్వర్యంలో కశింకోట సంతబయల ఎస్సీ కాలనీలో..



ఏఎంసీ కాలనీలో ..



గవరపాలెం అరుంధతీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుమార్‌రాజా



కశింకోటలోని పోలీస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళిత మహిళలు

అనకాపల్లి: పట్టణ, మండలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీ, గవరపాలెం అరుంధతి నగర్‌లో 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి ఆయన వివరించారు. పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

- స్థానిక మెయిన్‌రోడ్డు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ భారత పౌరుడిపై అంబేడ్కర్ ముద్ర ఉంటుందన్నారు. దళితవాడల్లో మాత్రమే రాజ్యాంగ దినోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి గృహంలో అంబేడ్కర్ చిత్రపటాలు పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ అల్లు వరబాబు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.
- తపాలాశాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తపాలాశాఖ డివిజన్ కార్యదర్శి వై.బి.పలాసరావు, రేబాక మధుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక నెహ్రూచౌక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ ప్రతినిధులు పల్లా బాబ్జి, డి.రమణ, శంకరావు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక రైల్వే స్టేషన్ రహదారి భీమునిగుమ్మం జీవీఎంసీ హైస్కూళ్ల అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక సీనియర్ నాయుడు సబ్బవరపు గణేష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కశింకోటలో...

కశింకోట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి దళిత మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను వక్తలు ప్రస్తుతించారు. రిటైర్డు ఎంఈవో నంబా రమణ, దళిత ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక సంతబయల ఎస్సీ కాలనీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, కొండబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి:
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com